పెంకె పిల్ల

రామనాథం గారు నాకు మామగారు కాబోతారని ఎరగకుండా వారింట్లో తూర్పు వేపు గదిలో అద్దెకుంటూ ఎనిమిదేళ్ళు చదువుకున్నాను. నా హైస్కూలు చదువంతా వారింట్లోనే వెళ్ళిపోయింది. మా పల్లెటూళ్ళో వీథిబడి చదువు పూర్తిచేసి నేను ఎనిమిదో ఏటనే చదువు కోసమై బస్తీకి రావలసి వచ్చింది. మా నాన్నకు ఇంగ్లీషు చదువంటే ఇష్టమే కాని బస్తీ జీవనం ఇష్టంలేదు. అందుకని ఆయన మా అమ్మతో శని ఆదివారాలు వచ్చినప్పుడు మాత్రం మా వూరు పోతూ కాలం వెళ్ళబుచ్చాను. మా అమ్మ కూడా పిల్లల విషయమై లేనిపోని ఆరాటాలు పెట్టుకొని తను గోలపడి ఇతరులను కంగారుపెట్టే రకంకాదు.

మా మామగారి చిన్న కూతురు రుక్మిణి అమిత పెంకె పిల్ల. పెంకెతనం కనీసం రెండు రకాలు - చూసేవాళ్ళకు కోపం తెప్పించే రకం ఒకటీ. చూడముచ్చటగా ఉండేది మరొకటీ. కొంతమంది మా అత్త మామల మాదిరిగా ఏ రకమైన పెంకెతనమూ సహించలేరు. రుక్మిణి చేసే అల్లరి నాకు చాలా ముచ్చటగా ఉండేది. ఆమె తల్లిదండ్రులకు తలనెప్పిగా ఉండేది. కొందరు పిల్లలు సహజంగా ఏడుపు గొట్టువాళ్ళయి ఉండి చేస్తున్న పని తప్పని తెలిసి చేస్తున్నట్టు చాటుమాటున అల్లరి చేస్తారు. వాళ్ళని చావగొట్టబుద్ధవుతుంది నాకు. రుక్మిణి తన పెంకెతనం తనే ఆనందించగలది. ఆ పిల్ల లోపల పొంగుతూ ఉన్న జీవశక్తిని ఆపుకోలేక దాన్ని అల్లరి రూపంగా విడుదల చేస్తున్నట్టుండేది. ఆ పిల్ల పెంకెతనం అనారోగ్యంతో కూడుకున్నది కాదని నా తాత్పర్యం.

రుక్మిణి సాక్షాత్తూ నా కళ్ళ ఎదుట పెరిగిందన్నమాట. నేను వారింట్లో ప్రవేశించే రోజుకు రుక్మిణి మూడు నాలుగు నెలల పిల్ల. అందుచేత నేను కాలేజిలో ప్రవేశించే వరకూ తల్లిదండ్రులను ఆ పిల్ల ఎంత బాగా ఎరుగునో నన్నూ అంతబాగా ఎరుగు. రామనాథంగారు మొదట మొదట ఆ పిల్లచేత అల్లరి చేయించటానికి నాకు కావలసినంత స్వతంత్రం ఇచ్చాడు. రుక్మిణి నా ఆసరా చూసుకొని తల్లిదండ్రులకు కూడా ఎదురు తిరిగి అల్లరి చేస్తుండేది.

రామనాథంగారెప్పుడైనా నాతో, "దానికి నువ్వట్లా అలుసివ్వకు, నాయనా. అది మరీ మితిమీరి పోతున్నది" అంటే నేను "పోనివ్వండి, మీ పెద్దమ్మాయల్లే మత్తాగా ఉంటే మాత్రం ఏం బాగుంటుంది" అని ఆయన్ను సర్దేవాణ్ని.

రుక్మిణికి స్వేచ్ఛవల్ల కలిగిన లాభం ఏమిటంటే చురుకుతనం. ఆ పిల్ల పైకి చూడటానికి ఎంత చలాకీగా ఆరోగ్యంగా ఉండేదో అంత చురుకైన బుర్ర కూడా సంపాదించింది. ఆ పిల్ల మగపిల్లలతోపాటు చెట్లూ చామలూ ఎక్కటమూ, చెడుగుడూ కోతికొమ్మచ్చూ ఆడటమూ మొదలైన పనులన్నీ చేసేది. తోడి పిల్లలు ఎవరైనా తనకు తీరని అన్యాయం చేసినట్టు తోస్తే వేరే ఆలోచన యేమీ లేకుండా చెంపమీద లాగి ఒకటి పెట్టేది. పాఠాలు చదివేది కాదు. ఆ పిల్లచేత పాఠం చదివించటం మా ఎవరిచేతా కాలేదు. కాని తన అక్క చదివే పాఠాలన్నీ విని వప్పగించేది. అప్పుడప్పుడు అక్క చదువులో తప్పులుపట్టి మేష్టరుతనం కూడా సాగించేది. ఆ ఎనిమిది సంవత్సరాల కాలంలోనూ ఆ పిల్ల అసహాయత వల్ల ఒక్కసారయినా ఏడిచినట్టు నాకు జ్ఞాపకం లేదు. రుక్మిణితో ఆడుకునే పిల్లల్లో ఎవరో ఒకరు రోజూ ఆమె మీద ఏదో చాడీ తెచ్చేవాళ్ళు. రామనాథం గారికీ ఆయన భార్యకూ మొహమాటం జాస్తి. ఎవరు తమ పిల్లమీద చాడీ తెచ్చినా తాము పిల్లని మందలించి తీరాలనే. రుక్మిణి నిష్కారణంగా వెళ్ళి ఇంకొకరిని గిల్లిరాదని నాకు బాగా తెలుసును. అందుకని ఆ పిల్ల తల్లిదండ్రులచేత తిట్లూ దెబ్బలూ తినటం ఒకటి రెండు సార్లు చూసి నేను సహించలేక పోయినాను. ఎవరైనా చాడీలు చెప్పితే నేను కేసు విచారణ చేసి రుక్మిణి వల్ల తప్పులేదని నిర్ధారణ చేసి ఫిర్యాదు చేసిన పిల్లలను పంపేసే వాణ్ని.

ఒక్క విషయంలో మాత్రం నేను రుక్మిణితో పాటు అపరాధినయినాను. చాలా చిన్నతనంలో రుక్మిణికి ఏ విధమైన మనఃక్లేశం కలిగినా దాన్ని పోగొట్టే మిషమీద ముద్దు పెట్టుకోవటం ఒకటి అలవాటు చేశాను. రుక్మిణి ఏదో వంకపెట్టి నాచేత ముద్దు పెట్టించుకునేది. అయిదేళ్ళ రుక్మిణిని నేను ముద్దుపెట్టుకోవటం ఎవరికీ ఎబ్బెట్టుగా తోచలేదు కాని ఎనిమిదేళ్ళ రుక్మిణిని నేను ముద్దుపెట్టుకుంటుండగా చూసిన ఒక పెద్దమనిషి – రామనాథంగారి బంధువు, చుట్టపు చూపుగా వచ్చాడు – తను చాలా కంగారు పడటమే కాకుండా రామనాథంగారితో కూడా అన్నాడు. మరొకరు అన్నమీదట రామనాథంగారికి ఆ పని ఆటే మంచిదికాదని తోచినట్టుంది. ఆయన నాతో అనటానికి చాతకాక రుక్మిణిని చాటుగా చివాట్లు పెట్టాడు. "ఏమిటది? అట్లా అతని వొళ్ళో కెళ్ళి కూర్చుని ముద్దుపెట్టుకోనిస్తే ఎవరన్నా ఏమనుకుంటారు? ఎనిమిదేళ్ళు వచ్చి ఎద్దల్లే!" అని.

రుక్మిణి సహజంగా తండ్రిమీద తిరగబడి పోట్లాడటమే కాక, ఆయన గోప్యంగా

మాట్లాడబోతే తను ఇల్లంతా చిందులుతొక్కి పెద్ద పెట్టున అరవటమేగాక, నాతో మా నాన్న ఇట్లా అన్నాడని కూడా చెప్పేసింది. నాతో రుక్మిణి ఇదంతా చెప్పిందని తెలిసిన తరువాత నేను తెలియనట్టు నటించితే నన్ను చూసినప్పుడల్లా ఆయన ప్రాణం చచ్చినట్టుండేదేమోనని, "ఇక రుక్మిణి నాతో అంత చనువుగా ఉండనట్టు చూస్తాను లెండి. ఇంకా రెండు నెల్లు. ఆ తరవాత మీ దయ ఉంటే ఈ మెట్టుదాటి కాలేజీ ఉండనే ఉంది... అయినా నేను రుక్మిణిని చిన్నపిల్లగదా అని ఎప్పుడూ ముద్దు పెట్టుకుంటూనే ఉన్నాను. ఏ తారీకునించి మాని ఉండవలసిందో నాకు ఇప్పటికీ తెలియకుండా ఉంది!" అని కాస్త అంటించాను.

ఆయన "ఆఁ! దానికింత రాద్ధాంతం ఏమిటి? మా చుట్టం తప్పుపట్టాడని అందరి ఎదటా ఎందుకట్లా మగవాళ్ళమీదికి ఎగబాకుతావన్నాను. కాని మరేంలేదు నాయనా! నువ్వంటే సరేననుకో! మరొకరౌతారు!.." అని తన్ను సమర్థించుకోజూశాడు.

నేను కాలేజీలో ప్రవేశించిన తరువాత చాల రోజులు రుక్మిణి దగ్గరలేని వెల్తి కనపడ్డది. ఆ పిల్లకోసం నేను బెంగపడ్డాను కూడాను. మొదట్లో దాదాపు ప్రతిరోజూ కల్లో కనిపించేది. నాకా పిల్లమీద ఎంత మమకారం ఉందో దూరం వెళ్ళిన తరవాతగాని తెలియలేదు. వారం పది రోజులు శలవులకు కూడా నేను ఇంటికి వెళ్ళేవాణ్ణి ఆ సంవత్సరం. దారిలో కాబోయే మామగారింట్లో ఒక రోజు ఉండి మరీ మా గ్రామం వెళ్ళేవాణ్ణి. రుక్మిణి వెనుక జరిగిన చిన్న ఘర్షణ మర్చిపోక నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా నన్ను పట్టుకునే వేళ్ళాడేది. ఒళ్ళో కూర్చోనే కూర్చునేది. నన్ను అడిగి ముద్దు పెట్టించుకునేది.

అంత పట్టుదల పిల్లను నేనెక్కడా చూడలేదు.

ఆ చలికాలపు శలవుల్లో మా నాన్న నా పెళ్ళిని గురించి ప్రస్తావిస్తూ "రామనాథంగారికి వాళ్ళమ్మాయిని నీకివ్వాలని ఉంది. నన్నడిగాడు. నీకేమైనా అభ్యంతరం ఉందా?" అన్నాడు.

నాకా వార్త చాలా తృప్తికరమయింది. అంతకాలం వారింట్లో ఉండి వారి కుటుంబం వదిలిపెట్టగానే కలిసిన బంధుత్వం బలవంతంగా తెగకోసుకున్నట్టనిపించింది. తరవాత ఒకటీ అరా రోజు వారింట్లో గడపబోతే అది పరాయి యిల్లే అనిపించింది. కాని వెనకటి మాదిరిగా లేదు. ఏమాత్రమైనా నాకు వెనకటి రోజులు ఇంకా అయిపోలేదనిపిస్తే దానికి రుక్మిణి ఒకత్తే కారణం.

"నాకేమీ అభ్యంతరం లేదు నాన్నా!" అన్నాను. నా ఉత్సాహం గమనించి మానాన్న వెంటనే రామనాథంగారి సంబంధం ఖాయం చేసుకున్నాడు. వచ్చే వేసవిలో పెళ్ళి అనుకున్నారు.

నాకు ఒకటే సంతోషం, రుక్మిణి నాకు మరదలు అయిపోతుంది. పెళ్ళి అయితే మా యిద్దరి చుట్టరికమూ ఖాయం అయిపోతుంది. తరవాత ఎవరూ దాన్ని మార్చలేరు.

బావా మరదలు బాంధవ్యం కంటె దగ్గిర బాంధవ్యం మా కిద్దరికీ కలగటానికి అవకాశం వుందని కాని, నేను దాన్ని ఎప్పటికైనా వాంఛించ బోతానని కాని నేను అప్పట్లో ఏ మాత్రము అనుమానపడలేదు కద!

నేను మళ్ళీ రామనాథంగారింట్లో అడుగుపెట్టటం స్నాతకం చేసుకున్న పెళ్ళి కొడుకునుగా.

మా మామగారి తరఫు పెద్దమనిషి మా విడిదికి వచ్చి, "అయ్యో! ఇంకా ఇట్లాగే కూర్చున్నారేం? ముహూర్తానికి మళ్ళీ వ్యవధానం ఉండదు లేవండి!" అని ఉచితరీతి ఏదైతే వుందో ఆ రీతిగా మమ్మల్ని కదలదీశాడు. నేను ఆ పెళ్ళివారి వసారాలో అడుగుపెట్టేటప్పటికి లోపల్నించి రుక్మిణి బయటికి వచ్చి నన్ను చూసి క్షణమాత్రం అట్లా ఆగింది.

ఆ దృశ్యం నేనెన్నటికీ మరవలేను. తలంటి పోసుకున్న జుట్టు ఆరటానికి విరబోసుకుని, మొహాన కళ్యాణం బొట్టు పెట్టుకుని, బుగ్గన చిన్న కాటుకచుక్క పెట్టుకుని, కాళ్ళకు పసుపూ పారాణీ పెట్టుకుని, కొత్తచొక్కా పరికిణీ కట్టుకొని రుక్మిణి కనిపించేప్పటికి నాకు మతిపోయింది. ఆ క్షణంలో ఉహించగలిగాను నాకా పిల్లతో ఎటువంటి బాంధవ్యం కావాలని నా అంతరాత్మ వాంఛించుతున్నదో. రుక్మిణి నన్ను చూసి ఆగిన క్షణమాత్రంలో నా మనస్సులో ఒక ఆశ అట్లా తళుక్కున మెరిసింది. ఏదో ప్రోగ్రాములో మార్పు జరిగి నేను రుక్మిణినే పెళ్ళి చేసుకోబోతున్నానని; ఆ ఆలోచన మాత్రం చేతనే నా మనసు ఎట్లా స్తంభించిపోయిందో మీరే ఊహించండి – రుక్మిణి వేసిన వేషం తోడు పెళ్ళికూతురు వేషమని ఆమెను అడగకుండా నా అంతట నేను ఊహించనే లేకపోయినాను.

ఒక్క క్షణం సేపు తన కళ్ళను నమ్మలేని దానల్లే రుక్మిణి నా వంక అట్లా చూసి ఒక్కపరుగున వచ్చి నా నడుము చుట్టువేసుకుంది... నేను అక్కడ వున్న మనుష్యులను ఎవరినీ లెక్కచేయకుండా రుక్మిణిని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాను.

ఆ ముద్దు నేను పూర్వం రుక్మిణిని పెట్టుకున్న ముద్దుల జాతిది కాదు. కాని, పాపం, రుక్మిణి ఆ తారతమ్యం గ్రహించగల స్థితిలో లేదు.

నా వివాహం అయిన మరుసటి సంవత్సరమే రుక్మిణి వివాహం జరిగింది. మా మామగారు ఆ పిల్లకు మంచి సంబంధం – పెద్దకూతురి కన్న మంచి సంబంధం – తెచ్చాడని ఆయన బంధువర్గం అభిప్రాయ పడ్డట్టు విన్నాను. రుక్మిణి మొగుడు నా కంటె

తప్పకుండా అందమైనవాడు. వస్తుతహా అతనికి నాకు ఉన్నంత ఆస్తి లేకపోయినా అతని బంధువర్గంలో చాలా గొప్ప గొప్ప ఉద్యోగస్తులున్నారు. నాకంటె కాస్త పై గ్రేడు కుటుంబీకుడనే చెప్పాలి.

కాని మా షడ్డకుడు కొన్ని కొన్ని విషయాల్లో అదోరకం మనిషి. దాచాలని ప్రయత్నం చేసేవాడేకాని అతను గర్వి అని అతని ప్రతి పనిలోను, అతను ఉచ్చరించే ప్రతి మాటలోనూ స్పష్టంగా స్ఫురిస్తూనే ఉండేది, గ్రహించగలవాడికి. అతనికి ప్రత్యేకంగా దేన్నిగురించీ సుమారుగానైనా తెలిసినట్టు కనబడలేదు. ప్రతిదాన్ని గురించీ ఏదో మాట్లాడాలని ప్రయత్నించేవాడే కాని అతని అభిప్రాయాలన్నీ జనసామాన్యం యొక్క అభిప్రాయాలు గానూ, అతని అభిరుచులు కూడా తుమ్మాయి జగ్గాయిగాళ్ళ అభిరుచులుగానూ తేలినై. కాస్త విచారించిన మీదట, అతనికి ఖచ్చితమైన అభిప్రాయాలు లేనేలేవు. అవి ఏ గాలి ఎటు కొట్టితే అటు మళ్ళేవి. అతనిలో నేను గమనించిన మరొక విశేషం ఏమిటంటే, ఎవరితోనైనా ఏ విషయమైనా తర్కించటం జరిగితే అవతలవాడు ఎన్ని కారణాలు చూపించినా వాడితో ఏకీభవించక, వాడి తర్కం మరొకవాడితో తర్కించేటప్పుడు ఉపయోగించేవాడు. ఆడవాళ్ళు చదువుకోవటం చాల అనర్థం అని నాతో వాదించి నేనెంత చెప్పినా వినక, మర్నాడు నా సమక్షానే ఇంకొకరితో ఆడవాళ్ళు చదువుకు తీరాలని వాదిస్తూ నేను చెప్పిన కారణాలే చెబుతున్నాడు.

అన్నిటికన్నా విచిత్రమైన విషయమేమిటంటే నేను తనను చూసి అసూయ పడుతున్నానని అతనికొక అభిప్రాయం ఎట్లా పడ్డదో పడ్డది. తనకు నా మీద గల ఆధిక్యత నా ఎదట మరుగు పరిచి నా అసూయను ఉపశమింప చెయ్యటానికి విశ్వ ప్రయత్నం చేసేవాడు.

నేను అతన్ని చూసి ఒక్కందుకే అసూయ పడ్డాను! అతను రుక్మిణి భర్త అయినందుకు. అందులో అతని ఆధిక్యత నాకేమీ కనిపించలేదు.

ఇంకా కొద్దిరోజులకు కాపరానికి వెళ్ళుతుందనగా రుక్మిణి మా యింటికి వచ్చి ఒక వారం రోజులున్నది. ఆ రోజుల్లో ఆమె తన అక్కను బాగా కోప్పడేది ప్రతిదానికీ.

"ఈ కూర ఇట్లా చేశావేం, అక్కయ్యా! బావకిట్లా సయించదు!.... ప్రతిదానిలోనూ ఇంత కారం వేస్తావేం! బావకు కారం పడదు... పూరీ లెందుకు చేస్తున్నావే? బావకు పూరీలు తినటం అంటే తగనిమంట! ... బావకు ఈ సగ్గు బియ్యపు పరమాన్నం కంటె బియ్యపు పరమాన్నమే ఇష్టంగాదూ?"

రుక్మిణి అట్లా మాట్లాడుతుంటే నాకు కడుపులో చెయ్యి పెట్టి కలియబెట్టినట్టు ఉండేది. పిచ్చి పిల్ల. ఆ వారం రోజుల్లోనూ తన అక్కను తన మాదిరిగా చేసిపోదామని.

అప్పటికి కూడా రుక్మిణికి నా మీద అభిమానం కాని వెనకటి పెంకెతనం గాని ఒక్క రవ్వంత అయినా పోలేదు. తను వెనకటి మాదిరిగా నన్ను పట్టుకుని ఊగటానికి లేదని కూడా ఆ పిల్లకు అర్థం కాలేదు. నేను జాగ్రత్తగా తప్పించుకుని తిరగకపోతే రుక్మిణి నా భార్య నిష్కారణంగా అనుమానపడేటట్టు చేసేదే.

రుక్మిణి ఒక విధంగా చాలా దురదృష్టవంతురాలు. అనేక విధములైన అదృష్టాల్లో ఒకటి ఏదంటే మన సుఖం ఎవరెవరి మీద ఆధారపడి ఉంటుందో వారికి మన స్వభావం నచ్చేటట్టు మనలను మనం మార్చుకోగలగటం. రుక్మిణి వంటి మనిషి ఎవరి కోసమూ మారలేదు. ఆ రకం నేనెరిగినంత వరకు నేనొకణ్ణి తప్ప మరెవరూ ఆమోదించలేదు. రుక్మిణి సుఖం నా మీద ఆవగింజంత కూడా ఆధారపడిలేదు.

ఆ పిల్ల తల్లిదండ్రులతో సుఖపడలేదు. భర్తకూడా ఆమెను సుఖపెట్టలేదు. అసలే చపలచిత్తుడు. ఆలోచనా శక్తిగానీ, గ్రహణ శక్తిగానీ లేనివాడు. అతనికి భార్య ఏ మాట మాట్లాడినా అనుమానంగానే ఉండేది. తన్ను భార్య చులకన చేస్తున్నదనీ, ఆమెకు పాపభీతిలేదనీ, చాలా “విడిచేసిన మనిషి” అనీ అతనికి భార్యను గురించి అనుమానం కలగటం మొదలుపెట్టింది. అతని అనుమానం నా మీదికి తిరగటానికి ఎంతోకాలం పట్టలేదు. రుక్మిణి తనకు నామీద గల అభిమానం భర్త దగ్గర ఏ మాత్రమూ దాచినట్టు కనిపించలేదు. చివరకు నేను అతన్ని చూసి అసూయపడటం అబద్ధమై, అతను నామీద అసూయ పడడం నిజమైంది.

అతను భార్యను తిట్టకుండా కొట్టకుండానే చాలా వేచుకుతిన్నాడు. ఒక్క సంవత్సరకాలంలో ఆమె ఉత్సాహం పూర్తిగా విరిచేశాడు.

నేను పనిమీద వాళ్ళ ఊరు వెళ్ళవలసి వచ్చింది. సహజంగా నేను వాళ్ళింటికే వెళ్ళాను. అదే నేను రుక్మిణి కాపరం చేస్తుండగా మొదటిసారి చూడటం. ఆమెను చూడగానే నాకు దాదాపు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. మా షడ్డకుడు బయటికి వెళ్ళాడు.

“రుక్మిణి... ఎవరు నిన్నిట్లా మార్చింది?”

“అంత మారిపోయినానా?” అన్నది రుక్మిణీ చెక్కిళ్ళు తడువుకుంటూ.

ఆ సమయంలో మా షడ్డకుడు ఎదట ఉంటే హత్య చేస్తామనిపించింది. అతను రుక్మిణిని చేసిందేమిటి? ఆ మార్పుకు అతనే కారణమని నేను గ్రహించలేనా?

“మారిపోయినావా? లేదు, సాంతంగా చచ్చిపోయినావు... ఎందుకిట్లా అయిందీ?”

రుక్మిణి ఏం చెబుతుందీ?

మా షడ్డకుడు ఇంటికి రాగానే నన్ను చూసి పరమానంద భరితుడైనట్టు కనిపించాడు.

నేను భోజనం చేసి పనిమీద వెళ్ళాను. నా పని నాలుగయిదు రోజులు పట్టేటట్టు కనిపించింది. ఆ రాత్రి నేను హోటలుకు వెళ్ళుతానంటే మా షడ్డకుడు కాదు, కూడదు, ఈ నాలుగు రోజులూ మా యింట్లోనే ఉండాలి అని నన్ను నిలిపివేశాడు. అతనికి మారు చెప్పటం నాకిష్టం లేకపోయింది. రుక్మిణి మొహం ఏం సూచిస్తుందోనని ఆమెవైపు తిరిగేటప్పటికి ఆమె మొగుడి వీపువంక మూడో కన్ను తెరిచి చూస్తున్నది. నాకదేమిటో అర్థం కాలేదు.

మర్నాడుదయమే అతను కాఫీ అవీ తెప్పించి ఆ పని పూర్తి కాగానే ఊళ్ళోకి వెళ్ళాడు.

అతను ఇల్లు దాటగానే రుక్మిణి నా దగ్గిరికి వచ్చి నాతో కాసేపు మాట్లాడాలన్నది. కానిమ్మన్నాను. అప్పుడామె తన భర్త గొడవ అంతా చెప్పుకొచ్చింది.

"నువు నిన్న నన్ను చచ్చిపోయినానన్నావు జ్ఞాపకం ఉందా ? నాకు సాక్షాత్తూ అట్లాగే ఉంది, బావా! మీ తమ్ముడుగారు నేను చేసిన పనికల్లా ఆడిన మాటకల్లా తప్పుపడతారు. కారణం ఏమిటో తెలియదు. నాకు కొంతకాలం నించి జంకు కలుగుతున్నది. నా మనస్సు అందరి మనస్సుల వంటిది కాదేమో. నేను వట్టి పాపిష్టి దాన్నేమోనని. నువ్వు నన్ను చిన్నప్పటినించీ ఎరుగుదువు కదా! నాలో పాడుగుణాలు ఏమేమి ఉన్నయ్యో చెప్పు! నువ్వు చెప్పితే నాకు నమ్మకం. నా తప్పులేమిటో దిద్దుకుంటాను.... చిన్నప్పటి రోజులు ఎంత బాగుండేవి! ... నీ కళ్ళకు కూడా నేను పాపిష్టిదానల్లే కనిపిస్తున్నానా? వెనక నన్ను చూసినట్టు చూస్తావా, బావా! చూడవు కాదూ? ఆ రోజులెంత బాగుండేవి? ... అప్పుడు భయం ఏమిటో ఎరగను. నాకిప్పుడెందుకింత భయం?... నువ్వు వచ్చినప్పటినించీ నాకు మళ్ళీ ప్రాణం వచ్చినట్టుంది! నాకు ఇల్లంతా చిందులు తొక్కాలనిపించింది. ఇంతలో ఆయన వచ్చారు. తరవాత నువ్వెక్కడికో వెళ్ళావు. ఇక నువ్వు వెళ్ళినప్పటినుంచి, బాబూ, ఏం మాట్లాడారనుకున్నావు? చాలాసేపు నాకేమీ అర్థం కాలేదు. 'నీకోసం వచ్చారే మీవారు!' అంటారు ! మీవారు అంటే నీ మొగుడని అర్థం కాదూ, బావా? అట్లా అంటం తప్పు కాదూ! నాకు వళ్ళు మండిపోయింది. 'అవును! నా కోసం ఎందుకు రాడు? మా బావకు నేనంటే ప్రాణం!' అన్నాను. 'నీకో' అన్నారు. 'అయ్యో, బాగుందే నాకూనూ' అన్నాను. 'ఆయన మొహం చూసేటప్పటికి ఎంత ధైర్యం వచ్చిందీ?' అన్నారు. నిజంగానే నాకెంతో ధైర్యం వచ్చింది. బావా – నువు నమ్ముతావో నమ్మవో... ఆ కోపం మళ్ళీ నా మీదే చూపించటం, నీతో చూడు ఎంత అపేక్షో! ఎట్లా మర్యాద చేస్తారో ఉండమని!

"మనం నిజంగా మళ్ళీ చిన్న పిల్లలం అయితే?... (ఆదుర్దాగా) నువ్వు నన్ను మళ్ళీ వెనకటి మల్లే ముద్దు పెట్టుకుంటావా, బావా?"

"ఆ! పెట్టుకుంటాను!"

రుక్మిణి మొహాన ఒక విధమైన తృప్తి వచ్చింది. తృప్తి అనుభవిస్తూ కాస్సేపుండి, అకస్మాత్తుగా, "నేను నిజంగా పాపిష్టిదాన్ననిపించటం లేదుగా?" అన్నది.

"లేదు, రుక్మిణీ!"

వెనక రుక్మిణీ ఎంతో తెలివితేటలు కలదిగా చురుకుగా ఉండేది. ఆ రుక్మిణేనా ఈ మాట్లాడేది అని ఆశ్చర్యపడసాగాను. అతను ఆమెను ఇట్లా ఎట్లా చెయ్యగలిగాడు?

రుక్మిణి మళ్ళీ నా వంక తిరిగి అనుమానిస్తూ "నన్ను ఒక్కసారి వెనకటి మోస్తరుగా ముద్దు పెట్టుకుంటావా బావా?" అన్నది.

నేను ఆశ్చర్యపడి "ఎట్లా పెట్టుకోగలను, రుక్మిణీ?" అన్నాను.

"నువ్వు కూడా నన్ను పాపిష్టిదాని కిందనే కట్టేశావు! ఎందుకు అబద్ధం ఆడుతావూ?" అన్నది రుక్మిణి పుట్టెడు దిగులుతో.

"అది నాది కాదు. నువ్విప్పుడు పెద్దదానివి కాలేదా? నేను నిన్ను ముద్దు పెట్టుకోవటం తప్పుకాదా?"

"వెనకనో?"

"అప్పుడు పెట్టుకున్నదారివేరూ! అప్పుడు చిన్న పిల్లలం!"

"అట్లాగే ఇప్పుడూ పెట్టుకో!... ఏమీలేదు, బావా ఎట్లాగైనా నేను వెనకటి దాన్నేనని నమ్మేటట్టు చెయ్యి"

"నేను చెయ్యలేను. ఆ మాటంటే ఆ లోపం నీలో ఉందనుకోకు! నాలోనే ఉంది. నా మాట నమ్ము!'

"నీలోనా? నేను నమ్మను. నువ్వేం మారావూ?"

"ఏం మారానా? నేను నిన్ను వాంఛించటం నేర్చుకున్నాను. నువ్వు నాకు కావాలి. కాని నిన్ను నోరు తెరిచి అడిగేటందుకు కూడా దమ్ములేదు నాకు. నేను వెనకటి వాణ్ణి కాను. ఇప్పుడు నువు వెనుకటి మాదిరిగా నా ఒళ్ళో కూర్చుని నన్ను ముద్దు పెట్టుకోనిస్తే నాకు నీ మీద గల మోహం కట్టలు తెగిపోతుంది. నేను వెర్రివాణ్ణయిపోయి నిన్నూ నన్నూ కూడా అపాయకరమైన స్థితిలోకి తెస్తాను. నీ బంధువులూ నా బంధువులూ తలలు పగలకొట్టుకోవలసి వస్తుంది!.. ఇంత విపులంగా ఇది నా చేత చెప్పించి నీ పెంకెపట్టు సాధించావు. తృప్తి అయిందా?"

రుక్మిణి నా వంక ఒక్క క్షణం దీనంగా చూసింది.

"అప్పుడే నేనంత పెద్దదాన్నయినానా నీకు...? ఇంకేం, అదే పాపిష్టి దాన్ని కావటమంటే! నువు కనుక్కోలేక పోయినావు!" అన్నది రుక్మిణి.

రుక్మిణి అన్న మాటలో నిజంలేదా?

మొదటి ముద్రణ : కారుణ్యం కథల సంపుటి, ఫిబ్రవరి 1937
యువ కార్యాలయం, తెనాలి